ప్రజాశక్తి
శుక్రవారం 21 జూన్ 2024 5
అనంతపురం

శవాలపై కాసుల వేట..!

◆ పోస్టుమార్టంకు రూ.5 వేలు.?
◆ సర్టిఫికెట్‌కూ పైసలివ్వాల్సిందే..
◆ అనంత సర్వజన ఆసుపత్రిలో దుస్థితి

మార్చురీ గది

ప్రజాశక్తి -అనంతపురం క్రైం

ప్రమాదాలు, ఆత్మహత్యల ఘటనల్లో ఎవరైనా అర్ధాంతరంగా మతి చెందితే ప్రభుత్వ నిబంధనల మేరకు ఆ మృతదేహానికి పోస్టుమార్టం చేయాల్సి ఉంటుంది. అర్ధాంతరంగా మతి చెందిన వారిని ఎంతో ఆవేదనతో వారి బంధువులు పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రిలోని మార్చురీ వద్దకు తీసుకొస్తారు. ఆ కార్యక్రమం పూర్తి చేసి ఎప్పుడెప్పుడు తమకు మతదేహం అప్పగిస్తారా అని బాధితులు మార్చురీ గది బయట వేచి ఉంటారు. ఇదే సమయంలో మరణించిన శవాలపై కూడా కాసులేరుకునే కార్యక్రమం అనంతపురం సర్వజన ఆసుపత్రి వద్ద కన్పిస్తుంది. పోస్టుమార్టం చెయాలంటే రూ.5 వేలు ఇవ్వాల్సిందేనంటూ అక్కడ పని చేసే పోలీసు, వైద్య సిబ్బంది డిమాండ్ చేస్తున్నారంటూ బాధితులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పోస్టుమార్టంకు సంబంధించి మతదేహాన్ని కోసిన అనంతరం కట్టే తెల్లబట్ట వరకూ అన్నింటినీ ప్రభుత్వమే భరించాలి. కానీ పోలీసులు, వైద్యులు మాత్రం డబ్బులివ్వందే పోస్టుమార్టం చేయలేం అంటూ బాధితుల వద్ద బేరం పెడుతున్నట్లు తెలుస్తోంది. డబ్బు ఇవ్వకపోతే పోస్టుమార్టం చేయాల్సిన డాక్టర్ ఈ రోజు డ్యూటీకి రాలేదనే సమాధానాలు చెబుతున్నారు. దీంతో దిక్కుతోచని స్థితిలో మృతుని బంధువులు డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితులు నెలకొన్నాయి.

సర్టిఫికెట్‌కూ రూ.5 వేలు..!

పోస్టుమార్టం అనంతరం మతులకు సంబంధించి ప్రతి లావాదేవీకి డెత్ సర్టిఫికెట్ అవసరం. ఈ సర్టిఫికెట్ వైద్య కళాశాలలోని ఫోరెన్సిక్ విభాగం ఇవ్వాల్సి ఉంటుంది. దీన్ని ఆసరాగా చేసుకుని వైద్యులు, పోలీసులు మతుల సంబంధీకుల నుంచి ముక్కు పిండి మరీ డబ్బులు వసూలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. ఇటీవల అనంతపురం నగరంలోని ఆదర్శనగర్‌కు చెందిన యువకుడు సోషల్ మీడియాలో పరిచయమైన ప్రేమ విఫలమై ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈసమయంలో ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో పోస్టుమార్టం చేయాలంటే రూ.5 వేలు ఇవ్వాల్సిందేనంటూ అక్కడున్న వైద్య, పోలీసు సిబ్బంది డిమాండ్ చేసినట్లు తెలుస్తోంది. యువకుని బంధువు ఒకరు మాజీ ఎంపీ తలారి రంగయ్య వద్ద పని చేస్తుండటంతో ఆయనతో ఫోన్ చేయించి ఎలాగోలా పోస్టుమార్టం చేయించారు. తీరా పోస్టుమార్టం సర్టిఫికెట్ దగ్గరకు వచ్చేసరికి పరిస్థితి మళ్లీ మొదటికి వచ్చింది. అక్కడా డబ్బు డిమాండ్ చేయడంతో నిరుపేద అయిన యువకుడి తండ్రి ఆయోమయంలో పడ్డాడు. రూ.5వేలు ఇచ్చుకోలేని ఆ పేద తండ్రి తన కుమారుడి పేరుతో ఎలాంటి ఇన్సూరెన్స్ పాలసీలు లేవని, తనకు ఆ పోస్టుమార్టం రిపోర్టు వద్దని అక్కడికి వెళ్లడమే మానేశాడు. ఇలాంటి ఘటనలు నిత్యం ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి వద్ద కన్పిస్తూనే ఉంటాయి. ఉన్నతాధికారులు దీనిపై స్పందించి పోస్టుమార్టం వద్ద డబ్బులు డిమాండ్ చేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని బాధితులు కోరుతున్నారు.

కరువుపై ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న కేంద్ర కరువు బృందం

విని వెళ్లారంతే..!

◆ చూడ్డానికి ఏమీ లేక ముఖాముఖితోనే సరి
◆ సమస్యలపై రైతుల ఏకరువు
◆ ముగిసిన కేంద్ర కరువు బృందం పర్యటన

కరువు బృందం ఎదుట సమస్యలను ఏకరవు పెడుతుతన్న పెద్ద కౌకుంట్ల గ్రామ రైతులు

ప్రజాశక్తి-అనంతపురం ప్రతినిధి, వజ్రకరూరు

రబీ సీజన్ ముగిసి.. కాలం కూడా మారింది. ఎండాకాలంపోయి వానాకాలం వచ్చింది. అదృష్టం కొద్ది ఈసారి వర్షాలు బాగా పడ్డాయి. ఇటువంటి సమయంలో కరువును చూడటానికి కేంద్ర కరువు బృందం ఉమ్మడి అనంతపురం జిల్లాకు విచ్చేసింది. జిల్లా అంతటా విస్తారంగా వర్షాలు పడ్డాక వచ్చిన కరువు బృందానికి కరువును చూసేందుకే ఏమీ లేక... గ్రామాల్లో పర్యటించి రైతులతో కలసి ముచ్చటించి పర్యటన మమ అనిపించి వెళ్లారు. రైతులు ఎప్పటిలాగానే కేంద్ర కరువు బృందం అనగానే... ఆదుకుంటుందని తమ సమస్యలన్నింటినీ ఏకరువు పెట్టారు... విన్న అధికారులు ప్రతిపాదనలను ప్రభుత్వానికి అందజేస్తామని ఓదార్పు మాటలు చెప్పేసి వెళ్లారు.

ప్రభుత్వం ఆదుకోవాలని రైతులు వేడుకోలు

'రబీలో వర్షాభావం వేసిన పంట చేతికందలేదు... పశు గ్రాసం కొరత కూడా ఏర్పడి మూగజీవాలకు ఇబ్బందులు తప్పలేదు.' అని రైతులు కేంద్ర కరువు బృందం ఎదుట సమస్యలను విన్నవించారు. క్షేత్ర స్థాయిలో ఇప్పుడు పంట పొలాలను పరిశీలించేందుకు వీల్లేకపోవడంతో కేంద్ర కరువు బృందం గురువారం రెండో రోజు క్షేత్ర స్థాయి పర్యటన సాగింది. అనంతపురం జిల్లాలో ఉరవకొండ, కణేకల్ మండలాల్లో ఈ బృందం పర్యటించింది. అగ్రికల్చర్ అండ్ ఫార్మర్స్ వెల్ఫేర్ జాయింట్ డైరెక్టర్ రితేష్ చౌహాన్ నేతృత్వంలో ఆయిల్ సీడ్స్ డైరెక్టర్ పొన్నుస్వామింతో పాటు జాయింట్ కలెక్టర్ కేతన్ గార్గ్ పాల్గొన్నారు. ఉరవకొండ మండలం పెద్దకౌకుంట్లలో పర్యటించినప్పుడు రైతులు రబీ సీజన్‌లో పడ్డ ఇబ్బందులను వివరించారు. ఒక ఎకరా పొలంలో రూ.28 వేలు ఖర్చు పెట్టి పప్పుశనగ సాగుచేస్తే వర్షాభావం మొత్తం దిగుబడి రాలేదని రామాంజినేయులు అనే రైతులు వివరించాడు. అనంతరం పాడి రైతు కృష్ణారెడ్డి మాట్లాడుతూ పశు గ్రాసం దాణా కూడా లేక పాడి పశువుల పోషణ భారంగా మారిందన్నారు. టిఎంఆర్, సైలేజ్ పశు గ్రాసాన్ని సబ్సిడీతో అందివ్వాలని కోరారు. రైతులతో సమావేశం అనంతరం నింబగళ్లు వద్దనున్న సమ్మర్ స్టోరేజీ ట్యాంకులను పరిశీలించారు. నీటి చుక్కలేక ఖాళీగానున్న ట్యాంకులను కరువు బృందం పరిశీలించింది. అనంతరం కణేకల్ మండలం సొల్లాపురం గ్రామంలో కరువు బృందం పర్యటించింది. అక్కడా రైతులతో ముచ్చటించారు. రైతు వెంకటరెడ్డి మాట్లాడుతూ నవంబరు, డిశెంబరులో చినుకు జాడలేక వేసిన పప్పుశనగ పంట మొత్తం పోయిందని ఆవేదన వ్యక్తం చేశారు. తమ గ్రామంలో అందరు రైతులు ఇదే రకంగా నష్టపోయారన్నారు. మల్లికార్జునరెడ్డి అనే పాడి రైతు మాట్లాడుతూ పశుగ్రాసం లేక ఉన్న ఐదు పశువులను అమ్మేసినట్టు తెలిపాడు. ప్రభుత్వమే ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ సందర్భంగా కరువు బృందం ప్రతినిధులు మాట్లాడుతూ సమస్యను కేంద్ర ప్రభుత్వం దృష్టి తీసుకెళ్లి సాయం అందేందుకు ప్రతిపాదనలు పంపిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో గుంతకల్లు ఆర్డీవో శ్రీనివాసులరెడ్డి, కళ్యాణదుర్గం ఆర్డీవో రాణి సుస్మిత, వ్యవసాయ శాఖ జెడిఎ ఉమామహేశ్వరమ్మ, పశుసంవర్ధక శాఖ జెడిఎ సుబ్రమణ్యం, గ్రౌండ్ వాటర్ డిడి తిప్పేస్వామి, డిడబ్లుఎంఎ పీడీ వేణుగోపాల్‌రెడ్డి, ఉద్యానవన శాఖ డిడి రఘునాథరెడ్డి, ఎపిఎంఐపి పీడీ ఫిరోజ్ ఖాన్‌తో పాటు ఆయా గ్రామస్తులు, రైతులు పాల్గొన్నారు.

ఎకరాకు రూ.28వేలు నష్టం

తన భూమిలో 1.05 ఎకరాల విస్తీర్ణంలో పప్పుశనగ పంటను గత రబీలో సాగు చేశాను. పంట కోసం ఎకరానికి రూ.28వేల ఖర్చు అయ్యింది. తేమ లేని కారణంగా పంట చేతికందకుండా పోయింది. పెట్టుబడులు కూడా చేతికందలేదు. ప్రభుత్వాలు స్పందించి సాయం అందించాలి.

బి.రామాంజినేయులు, రైతు, పెద్దకౌంకుట్ల గ్రామం.

పాడిరైతులను ఆదుకోండి

కరువు కాలంలో పాల ఉత్పత్తిని నిర్వహించడానికి తక్కువ ధరకు దాణా, టిఎంఆర్, సైలేజ్ గడ్డిని సరఫరా చేయాలి. పశువుల దాణా వినియోగానికి మేలు చేసే టిఎంఆర్ దాణాను ఇవ్వాలి. పాడి రైతులందరూ దాణా కోసం వేలాది రూపాయలు ఖర్చు చేస్తున్నారు. ప్రభుత్వమే తక్కువ ధరకు వీటిని అందిస్తే ఉపయోగంగా ఉటుంది.

కృష్ణారెడ్డి, పాడి రైతు.

'ఉపాధి'ని పెంచాలి

ఉపాధిహామీ కింద 100 రోజులు పని పూర్తి చేశాను. మరో 50-60 రోజులు పనులు పెంచాలి. ఉపాధి బిల్లులు కూడా సకాలంలో చెల్లించాలి. వ్యవసాయం చేసుకునే తమకు వర్షాభావంతో పంటలు పూర్తిగా నష్టపోయాం. ఇలాంటి సమయంలో ఉపాధి పనులే తమకు అండగా నిలిచాయి. వాటి పనిరోజులను మరింత పెంచి ఆదుకోవాలి.

హెచ్.వన్నూరు స్వామి, వ్యవసాయ కూలీ, రైతు.

దిగుబడి తగ్గింది

ఉరవకొండ మండలంలో ప్రధాన పంట పప్పుశనగ. ఈశాన్య రుతుపవనాల వైఫల్యం కారణంగా ప్రధానంగా నీటిపారుదల అవసరమైన సమయాల్లో తేమ లేకపోవడం వల్ల ప్రతికూలంగా ప్రభావితమైంది. దీని కారణంగా దిగుబడి తగ్గి రైతులకు నష్టం వాటిల్లింది.

పంట జి.సుభకర్, వ్యవసాయ అధికారి, ఉరవకొండ.

యోగాతో మానసిక ప్రశాంతత : ఎంపీ

ర్యాలీని ప్రారంభిస్తున్న ఎంపీ అంబికా లక్ష్మినారాయణ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

యోగాతో మానసిక ప్రశాంతతో పాటు, ఆరోగ్యం లభిస్తుందని ఎంపీ అంబికా లక్ష్మినారాయణ తెలియజేశారు. అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా ఆయుష్ డిపార్ట్మెంట్, బ్రహ్మకుమారీస్, వివేకానంద యోగ కేంద్రం ఆధ్వర్యంలో అనంతపురంలో గురువారం ర్యాలీ చేపట్టారు. ఆర్ట్స్ కాలేజీ వద్ద ఎంపీ ర్యాలీని జెండా ఊపి ప్రారంభించారు. ర్యాలీ ఆర్ట్స్ కాలేజ్ ప్రాంగణం నుంచి ప్రారంభమై టవర్ క్లాక్ మీదుగా సప్తగిరి సర్కిల్, శ్రీకంఠం సర్కిల్ మీదుగా తిరిగి ఆర్ట్స్ కళాశాల ప్రాంగణానికి చేరింది. ఈ సందర్భంగా ఎంపీ మాట్లాడుతూ యోగా మనసు, శరీరాన్ని సమన్వయం చేసి పరిపూర్ణ ఆరోగ్యాన్ని ఇస్తుందన్నారు. యోగ మానసిక సమస్యలను నివారించడంలోనూ తోడ్పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ కోగటం విజయభాస్కర్ రెడ్డి, అనంతపురం ఆర్మడ్ రిజర్వ్ పోలీస్ డీఎస్పీ మునిరాజా, ఆయుష్ సీనియర్ వైద్యాధికారులు డాక్టర్ రామకుమార్, డాక్టర్ రఫీక్, డాక్టర్ తిరుపతి నాయుడు, బ్రహ్మకుమారి ఈశ్వరి విద్యాలయ సిస్టర్ సరళ, వివేకానంద యోగ కేంద్ర అధ్యక్షులు రాజశేఖర్ రెడ్డి, యోగ మాస్టర్ వై.ఆంజనేయులు, ఈఎస్.మారుతి ప్రసాద్ పాల్గొన్నారు.

ఇంటర్ అర్హతతో ఉద్యోగాలు

22న అనంత ప్రభుత్వ ఐటిఐలో జాబ్‌మేళా

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

ఇంటర్మీడియట్ విద్యార్హతతో ఉద్యోగాల కల్పన కోసం ఈ నెల 22వ తేదీన అనంతపురం ఐటిఐ కళాశాలలో జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు అనంతపురం జిల్లా వత్తి విద్య, ప్రాంతీయ పర్యవేక్షణాధికారి గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. ఇంటర్మీడియట్ బోర్డు, హెచ్‌ఎల్సీ, టెక్ బిఇఇ సంయుక్త ఆధ్వర్యాన నిర్వహించే జాబ్‌మేళాలకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో 2022-23, 2023-24 విద్యా సంవత్సరాల్లో 75శాతం మార్కులతో ఇంటర్ పూర్తి చేసిన, ప్రస్తుత విద్యా సంవత్సరంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న అన్ని గ్రూపుల విద్యార్థులు ఇందుకు అర్హులు. 22న అనంతపురం ప్రభుత్వ ఐటిఐ కళాశాలలో ఉదయం 8 గంటల నుంచి అభ్యర్థుల ఎంపిక ప్రక్రియ ప్రారంభం కానుంది. ఎంపిక ప్రక్రియలో భాగంగా తొలుత క్యాట్ ఎగ్జామ్, ఇంటర్వ్యూ, చివరిగా ఇంగ్లీష్‌పై పరీక్ష నిర్వహిస్తారు. ఈ మూడింటిలో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థులకు ఏడాది శిక్షణ ఇస్తారు. ఈ కాలంలో నాలుగవ నెల నుంచి నెలకు రూ.10 వేల చొప్పున స్టైఫండ్ కూడా ఇస్తారు. బైపీసీ, సీఈసీ, హెచ్‌ఈసీ, ఒకేషనల్ కోర్సులు చదివిన వారు అడ్మినిస్ట్రేషన్‌కు సంబంధించి డీపీవో విభాగంలో ఉద్యోగాలు పొందే అవకాశం ఉంది. ఉద్యోగంలో చేరిన విద్యార్థుల చదువు అక్కడితో ఆగిపోకూడదనే ఉద్దేశంతో ఉద్యోగం చేస్తూనే ఉన్నత విద్యను అభ్యసించే అవకాశం కూడా కల్పించారు. ఇందుకోసం అమిటీ యూనివర్సిటీతో ఒప్పందం కుదుర్చుకున్నారు. ఇందులో భాగంగా బిసిఎ విద్యను అభ్యసించేందుకు అవకాసం కల్పించనున్నారు. ఆసక్తి, అర్హత ఉన్న విద్యార్థులు వారి బయోడేటా, ఎస్ఎస్ఐ, ఇంటర్ మార్కుల జాబితా, ఆధార్ కార్డు, రెండు పాస్‌పోర్టు సైజ్ ఫొటోలతో ఈ నెల 22వ తేదీ శనివారం ఉదయం 8 గంటలకు అనంతపురం ప్రభుత్వ ఐటిఐ కళాశాలకు రావాలని జిల్లా వత్తి విద్య, ప్రాంతీయ పర్యవేక్షణాధికారి తెలిపారు.

వసతిగృహాల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలి

కలెక్టర్ వినోద్‌కుమార్

హాస్టల్ పరిసరాలను పరిశీలిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

ప్రజాశక్తి-తాడిపత్రి రూరల్

వసతిగృహాల్లో విద్యార్థుల సంఖ్య పెంచాలని కలెక్టర్ వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ గురువారం తాడిపత్రిలో పర్యటించారు. ముందుగా కార్యాలయాన్ని పరిశీలించారు. వివిధ భాగాలు, రికార్డు రూమ్‌ను తనిఖీ చేశారు. అనంతరం నందలపాడు వద్ద ఉన్న సాంఘిక సంక్షేమ సమీకృత బాలుర వసతి గృహాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సాంఘిక సంక్షేమ సమీకృత బాలుర వసతి గృహంలో అవసరమైన మరమ్మతులను త్వరితగతిన చేపట్టాలన్నారు. ముఖ్యంగా వసతి గృహంలో మరుగుదొడ్లు, పైకప్పు పనుల మరమ్మతులు చేపట్టాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ జేడీ మధుసూదన్‌రావు, ఏఎస్‌డబ్ల్యుఓ ఫక్కీరయ్య, తహశీల్దార్ ఆంజనేయులు, సిఎస్‌డిటి రాజారామ్, తదితరులు పాల్గొన్నారు.

వసతి గృహం తనిఖీ

గుత్తి : పట్టణంలోని ఆర్ఎస్ రోడ్డులో ఉన్న బాలుర ప్రభుత్వ వసతి గృహాన్ని మున్సిపల్ కమిషనర్ జి.శ్రీనివాసులు గురువారం పరిశీలించారు. ఇందులో భాగంగా వసతి గృహంలోని రికార్డులను పరిశీలించారు. అనంతరం హాస్టల్ పరిస్థితిపై వార్డెన్ బాషాతో ఆరాతీశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ మేనేజర్ మురళీధర్, తదితరులు పాల్గొన్నారు.


కేంద్రం కరువు బృందంకు సమస్యలతో కూడిన వినతిపత్రం అందిస్తున్న రైతుసంఘం నాయకులు

జిల్లా రైతులను ఆదుకోండి

కేంద్ర కరువు బృందంకు రైతుసంఘం నాయకుల వినతి

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

తీవ్ర వర్షాభావంతో 2023-24 ఖరీఫ్, రబీలో పంట నష్టపోయిన అనంతపురం జిల్లా రైతులను అన్ని విధాలా ఆదుకోవాలని ఎపి రైతుసంఘం నాయకులు కోరారు. జిల్లా పర్యటనలో ఉన్న కేంద్ర కరువు బృందం సభ్యులను గురువారం అనంతపురంలోని ఆర్‌అండ్‌బి అతిథి గృహంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఎపి రైతుసంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ 2023 ఖరీఫ్, రబీలో అతివృష్టి, అనావృష్టితో వేరుశనగ, పప్పుశనగ, మిరప, పత్తి, ఆముదం, జొన్న, కొర్ర, మొక్కజొన్న, సజ్జ, పొద్దుతిరుగుడు, మినుములు, పెసలు, సోయాబీన్, ఉద్దులు, ఉలవలు, తెల్ల కుసుమ తదితర పంటలన్నీ చేతికందకుండా పోయాయన్నారు. ఆయకట్టు కింద కింద సాగుచేసిన పంటలను కూడా రైతులు నష్టపోయారన్నారు. జిల్లాలో గత నాలుగు సంవత్సరాలుగా ఇదే పరిస్థితి నెలకొందన్నారు. అప్పుల భారాలు భరించలేక 2019లో 46 మంది, 2020లో 67 మంది, 2021లో 41 మంది, 2022లో 66 మంది, 2023లో 48 మంది రైతులు ఆత్మహత్యలు చేసుకున్నారన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కరువు మండలాలుగా ప్రకటించారే తప్పా ఎలాంటి సహాయక చర్యలూ చేపట్టలేదన్నారు. ఇలాంటి పరిస్థితుల్లో రైతులను ఆదుకునేందుకు తక్షణం జిల్లాకు రూ.10వేల కోట్ల రూపాయలు ప్రత్యేక ప్యాకేజీ ప్రకటించి ఆదుకోవాలన్నారు. రైతుల పంట రుణాలు, ప్రయివేటు అప్పులన్నింటినీ ఒకేసారి మాఫీ చేయాలన్నారు. పంట నష్టపోయిన రైతులకు స్కేలు ఆఫ్ ఫైనాన్స్ ఆధారంగా పంట నష్టపరిహారం కనీసం 10 ఎకరాల వరకు ఇవ్వాలని కోరారు. పెట్టుబడి సాయం కుటుంబం ఆధారంగా కాకుండా, ఎకరాల ఆధారంగా కనీసం ఎకరాకు 10 వేలు, 10 ఎకరాల వరకు ఇవ్వాలన్నారు. డ్రిప్, స్ప్రింక్లర్లపై జీఎస్టీ రద్దుచేసి, ధరఖాస్తు చేసుకున్న ప్రతి రైతుకూ 90 శాతం సబ్సిడీతో ఇవ్వాలన్నారు. జిల్లాలో వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు ఏర్పాటు చేయాలన్నారు. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులు పూర్తిచేసి ప్రతి ఎకరాకూ సాగునీరు ఇవ్వాలన్నారు. ఆత్మహత్య చేసుకున్న రైతు కుటుంబాలకు గ్రామ పంచనామా ఆధారంగా రూ.10 లక్షలు పరిహారం ఇవ్వాలన్నారు. అన్ని గ్రామాల్లో పశుగ్రాస కేంద్రాలు ఏర్పాటు చేసి దాణా, మందులు 90 శాతం సబ్సిడితో ఇవ్వాలని కోరారు.

విధులకు దూరం.. కాలక్షేపానికి ప్రాధాన్యం..!

◆ కార్పొరేషన్‌లో కొందరు అధికారుల తీరుపై విమర్శలు ◆ కార్మిక సంఘాల ఆరోపణలకు బలం చేకూరేలా అధికారుల వ్యవహార శైలి

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

అనంతపురం కార్పొరేషన్‌లో కొన్ని విభాగాల అధికారుల తీరుపై సర్వత్రా విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. సదరు అధికారుల చిల్లర వ్యవహారాలతో కార్పొరేషన్ పరువు బజారుకెక్కుతోందనే గసగుసలు విన్పిస్తున్నాయి. కాసులకు కక్కుర్తి, పక్షపాత ధోరణితో అప్రతిష్టను తెచ్చిపెడుతున్నారనే ఆరోపణలు ఉన్నాయి. విధుల పట్ల నిర్లక్ష్యంగా ఉంటూ.. కాలక్షేపాలతో సమయం కానిచ్చేస్తున్నారు. ఇటీవల కార్పొరేషన్‌కు బదిలీపై వచ్చిన ఇద్దరు అధికారులు సాయంత్రం అవ్వగానే సూర్యనగర్‌లోని ఉడిపి హోటల్లో ఎడతెగని భాతాకానీల్లో గంటలు తరబడి కాలం వెళ్లబుచ్చుతున్నారు. ఈ ఇద్దరి అధికారులదీ ఒకే విభాగం కాదు. ఒక అధికారి పైఅంతస్తు నుంచి కిందకు దిగివచ్చి మరొ గదిలోకి వెళ్లి తొంగిచూసి వెళ్లిపోతారు. ఆ అధికారి తన వాహనంలో నేరుగా సూర్యనగర్‌కు చేరుకుంటారు. ఈయన తొంగిచూసి వెళ్లిన మరుక్షణమే మరో అధికారిని వెంటనే ముఖానికి మాస్కు వేసుకుని నేరుగా సూర్యనగర్ హోటల్‌కు వెళ్తారు. ఇది ఏదో ఒకరోజు జరిగే తంతుకాదు.. ప్రతి రోజు కార్పొరేషన్ కార్యాలయంలో వారు చేసే నిర్వాకం. ఈ ఇద్దరు అధికారులు గంటల తరబడి కాఫీకేఫ్‌లో ముచ్చటిస్తూ కాలక్షేపం చేస్తుండడం విస్మయానికి గురిచేస్తోంది. కార్పొరేషన్ విధులకు సంబంధించి సదరు అధికారిని సహోద్యోగులను పక్కన పెట్టి సచివాలయ సిబ్బందితో కార్యాలు చక్కబెడుతుంటారు. ఇలాంటి వాటిని నివారించాల్సిన కార్పొరేషన్ ఉన్నతాధికారి కూడా వాటి గురించి పట్టించుకోకపోవడం లేదనే విమర్శలు ఉన్నాయి. కార్పొరేషన్‌లో సదరు అధికారిని కాసుల కక్కుర్తితో సహోద్యోగులతో సైతం సఖ్యత ఉండడం లేదనే విమర్శలు విన్పిస్తున్నాయి. కార్యాలయంలో అధికారిణి మోనార్క్‌గా వ్యవహరిస్తున్నారనే ఆశాఖ సిబ్బంది గుసగుసలాడుకుంటున్నారు. అధికారుల నడుమ విభేదాలు అంతకంతకు పెరుగుతూ సహోద్యోగిని పక్కనపెట్టి అర్హత లేకున్నా సచివాలయ ఉద్యోగి చేత ఆఫీసు వ్యవహారాలు చక్కబెడుతున్న వైనంపై ఉద్యోగ వర్గాల్లో పెద్ద ఎత్తున చర్చ నడుస్తోంది. కార్పొరేషన్‌లో వార్షిక ఆడిటింగ్ జరిగినప్పుడు ఈ అక్రమ వ్యవహారం బహిర్గతమైతే దిగువ నుంచి పైస్థాయి వరకు అందరికీ అక్షింతలు తప్పవని కొందరు ఉద్యోగులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

కార్మికుడు మృతి చెందినా పట్టించుకోరు..!

కార్పొరేషన్ పరిధిలో ఇటీవల హెల్త్ ఆఫీసర్ బాధ్యతలు చేపట్టిన విష్ణుమూర్తి వ్యవహార శైలిపై గురువారం నాడు కార్మిక సంఘాల ఆగ్రహం వ్యక్తం చేశారు. పనులు చేసి అలసిపోయి కాసేపు విశ్రాంతి తీసుకుంటున్న కార్మికులపై ఆయన చెప్పలేని భాషలో తిట్లదండకం మొదలెడతారంటూ నాయకులు తెలిపారు. ఇవే విషయాలను రెండు రోజుల క్రితం కార్పొరేషన్ కార్యాలయం వద్ద ఆందోళన చేపట్టిన కమిషనర్ మేఘ స్వరూప్ దృష్టికి తీసుకెళ్లారు. గురువారం ఉదయం అనారోగ్యంతో కొండన్న అనే పారిశుధ్య కార్మికుడు మతిచెందారు. కార్మికుడు మృతి చెందినా కార్పొరేషన్‌లో పట్టించుకునే నాథుడు లేరంటూ మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తూ గురువారం మధ్యాహ్నం కార్యాలయం వద్ద ఆందోళనకు దిగారు. కార్మికుని దహన సంస్కారాలకు సైతం మట్టిఖర్చుల డబ్బులను అధికారులు ఇవ్వలేదంటూ వాపోయారు. కార్పొరేషన్ హెల్త్ ఆఫీసర్ కార్మికుల భద్రత కంటే తన సొంతక్లీనిక్ నిర్వహణకే అధిక ప్రాధాన్యత ఇస్తున్నా ఉన్నతాధికారులు పట్టించుకోవడం లేదని నాయకులు తెలిపారు. ఇలాంటి వాటిన్నింటిపై కార్పొరేషన్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని యూనియన్ నాయకులు కోరుతున్నారు.

మున్సిపల్ కార్యాలయం ఎదుట సిపిఎం నిరసన

సహాయ కమిషనర్ లావణ్యకు వినతిపత్రం సమర్పిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజాశక్తి-గుంతకల్లు

పట్టణని రైల్వేస్టేషన్‌కు వెళ్లే రోడ్లను మూసి వేయడాన్ని వ్యతిరేకిస్తూ సిపిఎం పట్టణ కార్యదర్శి బి.శ్రీనివాసులు ఆధ్వర్యంలో గురువారం స్థానిక మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజలు రైల్వేస్టేషన్‌కు వెళ్లాలన్నా.. చదువుకుంటున్న పిల్లలు చందమామ, చర్చి స్కూల్, రైల్వే, సెంట్రల్ స్కూల్, రైల్వే ప్రాంతంలో ఉన్న పాఠశాలలకు వెళ్లేందుకు ఉన్న దారులను రైల్వే అధికారులు మూసివేయడం సరైంది కాదన్నారు. మున్సిపల్ అధికారులు, రైల్వే అధికారులతో చర్చించి మూసివేసిన రహదారులను యథావిధిగా తెరిపించాలని కోరారు. అనంతరం డిమాండ్ల వినతిపత్రం సహాయ కమిషనర్ లావణ్యకు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం జిల్లా నాయకులు డి.శ్రీనివాసులు, పట్టణ కార్యవర్గ సభ్యులు దాసరి శ్రీనివాసులు, మారుతీప్రసాద్, సాకే నాగరాజు, జగ్గిలి రమేష్, రంగమ్మ, పట్టణ నాయకులు తిమ్మప్ప, జ్యోతి, రామునాయక్, రాజు సిఐటియు కాలనీవాసులు పాల్గొన్నారు.

రైతులను ఆదుకోవాలి : ఎంపీ

ప్రజాశక్తి-అనంతపురం కలెక్టరేట్

జిల్లాలో ఏర్పడిన కరువు దృశ్యా రైతులను అన్ని విధాలుగా ఆదుకోవాలని ఇంటర్ మినిస్టీరియల్ టీంకు అనంతపురం పార్లమెంటు సభ్యులు అంబికా లక్ష్మినారాయణ కోరారు. గురువారం అనంతపురం ఆర్ అండ్ బి గెస్ట్ హౌస్‌లో ఉన్న కేంద్ర కరువు బందం ప్రతినిధిని రితీష్ చౌహాన్‌ను ఎంపీ అంబికా లక్ష్మినారాయణ కలిసి రైతులకు తక్షణమే చేపట్టాల్సిన అంశాలపై వినతి పత్రం అందజేశారు. రూ. 247 కోట్లు రైతులు పెట్టుబడి రూపంలో ఖర్చు చేసి నష్టపోయారని తెలిపారు. వాటిలో కనీసం రూ. 135 కోట్లు నష్ట పరిహారంగా రైతులకు అందజేయాలని విజ్ఞప్తి చేశారు.

కార్మికుల ఆరోగ్యంపై నిర్లక్ష్యం తగదు

ప్రజాశక్తి-అనంతపురం కార్పొరేషన్

మున్సిపల్ పారిశుధ్య కార్మికుల ఆరోగ్యంపై నిర్లక్ష్యంగా తగదని మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం, జిల్లా అధ్యక్షులు ఎటిఎం నాగరాజు అన్నారు. గురువారం అనారోగ్యంతో మృతిచెందిన అవుట్ సోర్సింగ్ కార్మికులు కొండన్న మృతదేహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ వైద్యుల నిర్లక్ష్యంగా కారణంగానే కొండన్న మృతిచెందారని ఆరోపించారు. గురువారం తెల్లవారుజామున తీవ్ర అనారోగ్యానికి గురైన కొండన్నకు సకాలంలో వైద్యం అంది ఉంటే పరిస్థితి మరోలా ఉండేదన్నారు. ఎంబిబిఎస్ చదివిన డాక్టర్ హెల్త్ ఆఫీసర్‌ను ఏర్పాటు చేసినప్పుడు ఎంహెచ్ఒగా కార్మికులకు సకాలంలో వైద్యం అందించాలన్నారు. అయితే అందుకు భిన్నంగా ఎంహెచ్ఒ విష్ణుమూర్తి కార్మికులకు సకాలంలో వైద్యం అందించకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని వాపోయారు. గతంలో ఎవరైనా కార్మికులు అనారోగ్యంతో మృతిచెందితే ఎంహెచ్ఒ స్వయానా మృతుడి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించి, దహన సంస్కారాలకు డబ్బులు ఇచ్చి అండగా నిలబడేవారన్నారు. అయితే ఎంహెచ్ఒ విష్ణుమూర్తి మాత్రం కార్మికులను పట్టించుకోకుండా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్నారు. ఈయనకు ప్లాస్టిక్ కవర్లపై ఉన్నంత శ్రద్ధ కార్మికుల ఆరోగ్యంపై ఉండకపోవడం బాధాకరమన్నారు. ఈయన సర్వజన ఆసుపత్రి కావడంతో ఉదయం 7 గంటలకు వచ్చి సాయంత్రం 5 గంటలకు వెళ్లారన్నారు. అంతేగాకుండా తాడిపత్రిలో సొంత క్లినిక్ ఏర్పాటు చేసి కార్మికులను పట్టించుకోవడం లేదని ఆరోపించారు. అంతేగాకుండా ఎంహెచ్ఒ విష్ణుమూర్తి మహిళల పట్ల అసభ్యంగా మాట్లాడుతున్నాడని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటి వరకూ కార్మికులకు మెడికల్ చెకప్ చేయించకపోవడాన్ని చూస్తే కార్మికుల ఆరోగ్యంపై ఎంహెచ్ఒకు ఉన్న నిర్లక్ష్యం స్పష్టంగా అర్థం అవుతుందన్నారు. ఈ విషయంపై అనంతపురం నగరపాలక సంస్థ కమిషనర్ మేఘస్వరూప్ జోక్యం చేసుకుని కార్మికుల ఆర్యోగ్యాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. ఇకపోతే ప్రధానంగా మున్సిపల్ కార్మికులకు ఇపిఎఫ్, ఇఎస్ఐ సంబంధించి కన్సల్టెంట్ ఏర్పాటు చేయాలని కోరారు. అలాగే అనారోగ్యంతో మృతిచెందిన కొండన్న కుటుంబానికి దహన సంస్కారాల నిమిత్తం రూ.15వేలు కేటాయించి కుటుంబంలో ఒకరికి ఉపాధి కల్పించాలని డిమాండ్ చేశారు. రూ.2లక్షలు ఎక్స్‌గ్రేషియా చెల్లించి కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో రెగ్యులర్ ఉద్యోగ కార్మిక సంఘం నగర కార్యదర్శి ఎం.నల్లప్ప, నగర అధ్యక్ష, కార్యదర్శులు బండారి ఎర్రిస్వామి, సాకే తిరుమలేష్, జిల్లా కమిటీ సభ్యులు లక్ష్మీనారాయణ, ఆదినారాయణ, శశీంద్రకుమార్, మహిళా కన్వీనర్లు లక్ష్మీనరసమ్మ, మంత్రి వరలక్ష్మి, ఆరు సర్కిల్ నుంచి కమిటీ లీడర్లు, కార్మికులు పాల్గొన్నారు.

ఎంహెచ్ఒ నిర్లక్ష్యంతోనే కార్మికుడు కొండన్న మృతి

ఎంహెచ్ఒను సస్పెండ్ చేయాలి

మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు నాగభూషణం

కార్మికుడు కొండన్న మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న మున్సిపల్ ఉద్యోగ కార్మిక సంఘం నాయకులు

రోడ్డుపై మురుగునీటిని వదలొద్దు..

ప్రజాశక్తి-కుందుర్పి

ఇళ్లల్లో వాడుకున్న మురుగునీటిని ప్రధాన రహదారులపై వదలకూడదని ఎంపిడిఒ నరసింహరావు సూచించారు. సర్పంచి, పోలీసులు, వైద్య సిబ్బంది ఆధ్వర్యంలో గురువారం మండల కేంద్రంలోని నివాస గృహాల వద్దకు వెళ్లి కలుషిత నీటిపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రహదారులపై మురుగునీరు వదలడం వల్ల ప్రజలు చాలా ఇబ్బందులు పడతారన్నారు. ముఖ్యమంగి ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి వచ్చే రోగులు మరింత రోగాల బారిన పడే అవకాశం ఉందన్నారు. అంతేగాకుండా స్థానికులకు కూడా డెంగీ, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులు వచ్చే ప్రమాదం ఉందన్నారు. కావున ప్రజలు ఇళ్లల్లోని మురుగునీటిని రోడ్లపై వదలరాదన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి మారుతీశ్వరి రామమూర్తి, ఎస్ఐ వెంకటస్వామి, ఎంపిహెచ్ఒ ధర్మసింగ్, పంచాయతీ కార్యదర్శులు మహబూబ్‌బాషా, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

ఇంటి అభిమానులతో మాట్లాడుతున్న అధికారులు

విదేశీ విద్యకు అంబేద్కర్ పేరు పెట్టడం హర్షణీయం

అనంతపురం కలెక్టరేట్ : విదేశీ ఉన్నత విద్యా పథకానికి అంబేద్కర్ పేరును తిరిగి ప్రవేశపెట్టడం హర్షణీయుని ఎంఆర్‌పిఎస్ రాష్ట్ర కమిటీ చైర్మన్ బిసిఆర్.దాస్ గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సిఎం చంద్రబాబు అధికారంలోకి రాగానే జగనన్న విదేశీ విద్యాకానుక పేరును తొలగించి అంబేద్కర్ పేరు పెట్టడం సముచితంగా గౌరవప్రదంగా ఉందన్నారు. నాడు జగన్ ప్రభుత్వం అంబేద్కర్ పేరును తొలగించి దేశ ప్రజల మనోభావాలను దెబ్బతీశాడన్నారు. విజన్ ఉన్న నాయకుడు చంద్రబాబు అంబేద్కర్ ను మరోసారి గౌరవించుకోవడం తమకెంతో సంతోషంగా ఉందన్నారు. ఇందుకు చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

పాల్తూరులో 'నేను బడికి పోతా'

ప్రజాశక్తి-వజ్రకరూరు

విడవనకల్లు మండలం పాల్తూరు గ్రామంలో 'నేను బడికి పోతా' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మెయిన్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు గోర్తి వెంకటస్వామి మాట్లాడుతూ ఆరేళ్ల నుంచి 14ఏళ్ల వయసున్న పిల్లలు చదువుకు దూరమయ్యే పరిస్థితి లేకుండా చేయాలని తల్లిదండ్రులకు సూచించారు. బడిఈడు పిల్లలను బడిలో చేర్పించాలనే ఉద్దేశంతో సమన్వయ సమావేశాలు, ప్రభుత్వ బడుల్లో పిల్లలకు అందుతున్న సంక్షేమ పథకాల వివరణ గోడపత్రికలు, వివిధ మాధ్యమాల ప్రచారం, ర్యాలీలు నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరూ తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పాల్తూరు మెయిన్ స్కూల్ టీచర్లు, విద్యార్థులు, తల్లిదండ్రులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

ర్యాలీ నిర్వహిస్తున్న ఉపాధ్యాయులు, విద్యార్థులు

సచివాలయాలతో మెరుగైన సేవలు

వజ్రకరూరు : సచివాలయాల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని ఉరవకొండ ఎంపిడిఒ సుబ్బరాజు సూచించారు. డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఆదేశాల మేరకు గురువారం ఉరవకొండ ఎంపిడిఒ కార్యాలయంలో డిజిటల్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు. ఇందులో భాగంగా డిజిటల్ అసిస్టెంట్లకు వివిధ రకాల సర్టిఫికెట్ల వాడుకలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ కార్యక్రమంలో కార్యాలయపు పరిపాలన అధికారి జయరాములు, డిజిటల్ అసిస్టెంట్లు నూర్‌మహమ్మద్, నాగవేణి, మస్తాన్, మొహమ్మద్ షమీర్ సయ్యద్, ప్రసన్న, నూర్‌బాషా, ఎర్రిస్వామి, అహ్మద్, శ్రీకాంత్, సాగర్‌కుమార్, సునీత, పరమేష్‌నాయక్, తేజేష్, మహబూబ్‌బాషా, రోజా, విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

యోగాతో శారీరక, మానసిక ఆరోగ్యం

పామిడి : యోగా చేయడం ద్వారా మానసిక ఒత్తిడి, ఆందోళన, నిద్ర మెరుగు పరచడంలో ఉపయోగం ఉంటుందని యోగా ట్రైనర్ సంధ్య సూచించారు. అంతర్జాతీయ యోగా డేను పురస్కరించుకుని గురువారం పట్టణంలోని సరస్వతి విద్యామందిరం, టంగుటూరు చిన్నప్ప శ్రేష్టి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ఎస్ఎఫ్ఎస్ పాఠశాల, ట్రినిటీ పాఠశాల, కస్తూరిబా పాఠశాల విద్యార్థులు ర్యాలీ నిర్వహించారు. ఆయా పాఠశాలల నుంచి ర్యాలీగా ఎద్దులపల్లి రోడ్డు సర్కిల్‌కు చేరుకుని మానవహారంగా ఏర్పడ్డారు. ఈ కార్యక్రమంలో లాయర్ దత్తు, రవి, పత్రా శ్రీనివాసులు, జోజోడే కుమార్, రామాంజనేయులు, ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

కార్యకర్తలతో మాజీ ఎమ్మెల్యే సమావేశం

పామిడి : స్థానిక అనిమిరెడ్డి ఫ్యాక్టరీలో మాజీ ఎమ్మెల్యే వై. వెంకట్రామిరెడ్డి గురువారం నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే మాట్లాడుతూ గెలుపోటములు సహజమన్నారు. కావున కార్యకర్తలు అధైర్యపడవద్దని ధైర్యంగా ఉండాలన్నారు. కార్యకర్తలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి శ్రేణులు, తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయానికి 'ఉపాధి' అనుసంధానం చారిత్రాత్మకం

గుత్తి : రాష్ట్ర పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి పవన్‌కళ్యాణ్ తొలి సంతకాన్ని ఉపాధి హామీ పథకానికి వ్యయసాయానికి అనుసంధానం చేస్తూ చేయడం చారిత్రాత్మకమని మాజీ ఎమ్మెల్యే కొట్రికె మధుసూదన్ అన్నారు. గురువారం పట్టణంలోని స్వగృహంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలోనే రైతాంగం పట్ల తీసుకున్న ఈ నిర్ణయం అద్భుతమన్నారు. ఎంతోమంది వ్యవసాయం చేయాలనుకున్నా కూలీల కొరతతో వ్యవసాయానికి దూరం అవుతున్నారన్నారు. ఈ సమయంలో ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయడం వల్ల రైతులకు కూలీల సమస్య తీరుతుందన్నారు. ఇంతటి గొప్ప నిర్ణయం తీసుకున్న మంత్రి పవన్‌కళ్యాణ్‌కు నియోజవర్గ ప్రజలు పక్షాన ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఇకపోతే గతంలో రైతులు రూ.16 వేలు కడితే విద్యుత్ మోటార్ కనెక్షన్ ఇచ్చేవారన్నారు. అయితే నేడు దాదాపు రూ.3లక్షలు చెల్లించాల్సి ఉందన్నారు. ఈ భారం లేకుండా సరి చేయాలని కోరారు. ఇకపోతే నూతన ఎమ్మెల్యే జయరామ్ గుత్తిలో తాగునీటి సమస్య పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు వలిసాబ్, హబీబ్, జిలాన్, తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి వార్తకు స్పందన

గూగూడులో ఆలయాలకు సంప్రదాయ రంగులు

ప్రజాశక్తి-నార్పల

మండల పరిధిలోని గూగూడు గ్రామంలో మత సామరస్యానికి ప్రతీకగా వెలసిన కుళ్లాయిస్వామి, ఆంజనేయ స్వామి ఆలయాలకు సంప్రదాయ రంగులు వేశారు. ప్రజాశక్తి దినపత్రికలో 'గూగూడులో మరోసారి రంగుల రాజకీయం జరిగేనా' అన్న కథనం గురువారం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఇందుకు స్పందించిన జంట ఆలయాల ఇఒ శోభ గురువారం దగ్గరుండి ఆలయానికి సంప్రదాయ రంగులను వేయించారు. గతంలో కుళ్లాయిస్వామి ఆలయానికి వేసిన రంగుల విషయంలో గ్రామంలో పెద్దస్థాయిలో వివాదం చెలరేగింది. ఈనేపథ్యంలో త్వరలో ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో గతాన్ని పోలుస్తూ ప్రజాశక్తితో కథనం ప్రచురితమైంది. దీంతో వెంటనే స్పందించిన ఇఒ దగ్గరుండి సంప్రదాయ రంగులను వేయించారు. ఆలయాలకు సంప్రదాయ రంగులు వేస్తుండడంతో గ్రామస్తులు, భక్తులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

సంప్రదాయ రంగుల్లో జంట ఆలయాలు

డ్రై డేపై ప్రజలకు అవగాహన కల్పించాలి

నార్పల : డ్రై డే ఫ్రైడేపై గ్రామీణ ప్రాంత ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపిడిఒ రాముడు సంబంధిత పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. గురువారం మండల కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మండలంలోని అన్ని గ్రామాల్లో డ్రై డే ఫ్రైడేను పాటించాల్సిందే అన్నారు. ఇందులో భాగంగా ప్రతి పంచాయతీ కార్యదర్శి వారి సచివాలయ పరిధిలో ఉన్న ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, వెల్ఫేర్ అసిస్టెంట్‌తో సమావేశం ఏర్పాటు చేసుకుని ప్రజలందరికీ అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా వర్షాలు కురుస్తుండడం వల్ల హాస్టళ్లు, కమ్యూనిటీ భవనాల్లో ఎక్కడైనా నీరు నిలిచి ఉంటే ఆయా ప్రాంతంలో ఆయిల్ బాల్స్, కిరోసిన్ అలాంటివి స్ప్రేచేయాలన్నారు.

ఉచిత గర్భకోశ శిబిరం

గుమ్మఘట్ట : మండల పరిధిలోని బేలోడు, రంగచేడు గ్రామాల్లో జిల్లా గణాభివృద్ధి సంస్థ డిప్యూటీ డైరెక్టర్ డాక్టర్ పీవీ సుధాకర్ ఆధ్వర్యంలో గురువారం ఉచిత గర్భకోశ శిబిరం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ నూతనంగా పశు వైద్య సహాయకులుగా చేరిన వారు రైతులకు పశువుల గర్భధారణపై అవగాహన కల్పించాలన్నారు. పాడి అభివృద్ధి చెందేందుకు ఈత, ఈతకూ వ్యత్యాసం ఎలా ఉండాలో రైతులకు వివరించాలన్నారు. ఈత, ఈతకూ వ్యత్యాసం చాలా సుదీర్ఘంగా ఉన్నట్లయితే దాన్ని తగ్గించుకుని డాక్టర్ సలహా మేరకు కృత్రిమ గర్భధారణ చేయించాలన్నారు. బేలోడులో 72 ఆవులు, రంగుచేడులో 66 పశువులకు చికిత్స అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గుమ్మగట్ట మండల పశువైద్యాధికారులు పి.నవీన్‌కుమార్, రమేష్, నూతనంగా ఎన్నికైన సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

నోటు పుస్తకాలు పంపిణీ

శింగనమల : మండల పరిధిలోని సోదనపల్లి గ్రామం ఎస్సీ కాలనీలో ఉన్న ఎంపిపి పాఠశాలలో ఉపాధ్యాయురాలు ముబీనా సుమారు 42 మంది విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు మొబీనా మాట్లాడుతూ పేద విద్యార్థుల తల్లిదండ్రులు రెక్కాడితే గానీ డొక్కాడని పరిస్థితి అన్నారు. వారి బాధలను తెలిసి ఉచితంగా నోటు పుస్తకాలు పంపిణీ చేసినట్లు తెలిపారు. ఇకపోతే బడిఈడి పిల్లలను పాఠశాలల్లో చేర్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థి తల్లిదండ్రులు, పిల్లలు, తదితరులు పాల్గొన్నారు.

డ్రెయినేజీ పనులు ప్రారంభం

కుందుర్పి : గ్రామ పంచాయతీ నిధులతో గురువారం స్థానిక చీరల వీధిలో సర్పంచి మారుతీశ్వరి రామమూర్తి డ్రెయినేజీ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రజల పడుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని డ్రెయినేజీ పనులను ప్రారంభించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మంజునాథ, తదితరులు పాల్గొన్నారు.

భువనేశ్వరి జన్మదిన వేడుకలు

కేక్ కోస్తున్న టిడిపి నాయకులు

అనంతపురం కలెక్టరేట్ : టిడిపి విజయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి నారా భువనేశ్వరి పాత్ర చాలా కీలకంగా నిలిచిందని టిడిపి అనంతపురం అర్బన్ నాయకులు అన్నారు. ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ సూచన మేరకు గురువారం అర్బన్ టీడీపీ కార్యాలయంలో కేక్ కోసి సంబరాలు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఆదినారాయణ, తెలుగు మహిళ రాష్ట్ర అధికార ప్రతినిధి సంగా తేజస్విని, నాయకులు లింగారెడ్డి, కూచి హరి, వడ్డే భవాని, మోహన్, పరమేష్, ఐఎంఎం బాషా, ఏలూరి మారుతీనాయుడు, గుడిపూటి సురేష్‌చౌదరి, గురు, ఆయేషా, ఎస్ఎం.బాషా, జోగి రాజేంద్ర, జస్వంత్, వ్యాస్, తదితరులు పాల్గొన్నారు.

నేరాలు ఘోరాలు

విద్యుదాఘాతంతో రైతు మృతి

చంద్రమౌళి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు, (ఇన్‌సెట్‌లో) పాతచిత్రం

నార్పల : మండల పరిధిలోని బొందలవాడ గ్రామంలో రైతు చంద్రమౌళి (48) గురువారం విద్యుదాఘాతంతో మృతిచెందారు. స్థానికులు తెలిపిన వివరాల మేరకు... తెల్లవారుజామున పంటకు నీరు పెట్టేందుకు చంద్రమౌళి తోటకు వెళ్లారు. ఇందులో భాగంగా మోటార్ ఆన్ చేస్తుండగా స్టార్టర్ పెట్టెకు విద్యుత్ సరఫరా కావడంతో షాక్ గురై అక్కడికక్కడే మృతిచెందారు. ఉదయం తోటకు వెళ్లిన కుటుంబీకులు గమనించి బోరున విలపించారు. కాగా చంద్రమౌళి మృతి విషయం తెలుసుకున్న గ్రామస్తులు భారీ సంఖ్యలో తోటకు చేరుకున్నారు. అనంతరం పోలీసులకు సమాచారం ఇవ్వడంతో ఎస్ఐ రాజశేఖర్‌రెడ్డి ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం అనంతపురం ప్రభుత్వసర్వజన ఆసుపత్రికి తరలించారు. మృతుని తండ్రి వన్నూరప్ప ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. ఇకపోతే చంద్రమౌళి టిడిపి జిల్లా నాయకులు ఆలం వెంకట నరసానాయుడుకు ఉంటూ పంచాయతీ వార్డు మెంబర్‌గా కొనసాగుతున్నారు. దీంతో వెంకట నరసానాయుడు ఘటనా స్థలానికి చేరుకుని కుటుంబ సభ్యులను ఓదార్చారు.

నారాయణపురంలో చోరీ

కళ్యాణదుర్గం : మండల పరిధిలోని నారాయణపురం గ్రామానికి చెందిన చాకలి ఆదినారాయణ ఇంట్లో బుధవారం రాత్రి చోరీ జరిగింది. బాధితుడు తెలిపిన వివరాల మేరకు... గుర్తు తెలియని దుండగులు ఇంట్లోకి చొరబడి బీరువాలోని రూ.2,62,500 నగదుతోపాటు జత కమ్మలు, ఒక చైన్ను దొంగలించినట్లు వాపోయాడు. పెళ్లి కోసం బ్యాంకు నుంచి నగదు తీసుకొచ్చి ఇంట్లో దాచుకున్నట్లు తెలిపాడు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వైసిపి నాయకురాలు మృతి

గుత్తి : వైసిపి నాయకురాలు, న్యాయవాది నిర్మలారెడ్డి గురువారం మృతి చెందారు. గుత్తి ఆర్ఎస్‌కు చెందిన ఈమె కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతోంది. ఈనేపథ్యంలో గురువారం మృతిచెందడంతో వైసిపి నాయకులు, బార్ అసోసియేషన్ నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. అనంతరం కుటుంబ సభ్యులను పరామర్శించారు.

నిర్మలారెడ్డి (పాతచిత్రం)

'ఉపాధి' అనుసంధానం హర్షణీయం

శింగనమల : ఉద్యాన పంటలకు ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానం చేయడం హర్షణీయమని జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి సాకే మురళీకృష్ణ, జిల్లా కార్యదర్శి బొమ్మన పురుషోత్తమరెడ్డి గురువారం ఒక ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. జనసేన పార్టీ అధ్యక్షులు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బాధ్యతలు తీసుకున్న సందర్భంగా గ్రామీణ అభివృద్ధిలో భాగంగా ఉద్యాన పంటలకు జాతీయ ఉపాధి హామీ పథకాన్ని అనుసంధానిస్తూ మొదటి సంతకం చేయడం సంతోషకరమన్నారు. దీంతోపాటు గిరిజన ప్రాంతాల్లో పంచాయతీ భవనాలు నిర్మించడానికి 2వ సంతకం చేసినందుకు హర్షం వ్యక్తం చేశారు.

ఘనంగా గ్రాడ్యుయేషన్ డే

పెద్దపప్పూరు : మండల పరిధిలోని ముచ్చుకోట అంగన్వాడీ సెంటర్‌లో సిడిపిఒ షాజిదాబేగం, సూపర్‌వైజర్లు నారాయణమ్మ, జయలక్ష్మి ఆధ్వర్యంలో గురువారం గ్రాడ్యుయేషన్ డేను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అంగన్వాడీ సెంటర్లలో చిన్నారులకు మంచి పౌష్టికాహారం అందించడంతోపాటు మంచి విద్యాబుద్ధులు నేర్పించే కేంద్రాలుగా నిలుస్తున్నాయన్నారు. అనంతరం పలువురిని 1వ తరగతికి ప్రమోట్ చేస్తూ సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో పిల్లలు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

సిఎం సలహాదారు లక్ష్మీనారాయణను కలిసిన శివకృష్ణచౌదరి



లక్ష్మీనారాయణకు పుస్తకాన్ని అందజేస్తున్న శివకృష్ణచౌదరి

నార్పల : ముఖ్యమంత్రి చంద్రబాబు సలహాదారులు లక్ష్మీనారాయణను శివక్రిష్ణ ఛారిటబుల్ ట్రస్టు ఛైర్మన్ బొందలవాడ శివకృష్ణచౌదరి గురువారం హైదరాబాద్‌లో కలిశారు. లక్ష్మీనారాయణ ఆహ్వానం మేరకు హైదరాబాదులోని స్వగృహానికి వెళ్లి అతిథ్యాన్ని స్వీకరించారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ నందమూరి తారకరామారావు జీవితచరిత్ర పుస్తకాన్ని శివకృష్ణచౌదరి బహూకరించారు.

తాగునీటి సమస్య లేకుండా చూడాలి : ఎంపిడిఒ

పుట్లూరు : మండలవ్యాప్తంగా గ్రామాల్లో ఎలాంటి నీటి సమస్య లేకుండా చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ దస్తగిరి ఆయా గ్రామాల కార్యదర్శులకు సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఎంపిడిఒ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామంలో తాగునీరు, పారిశుధ్యం సమస్యలు రానీయకూడదన్నారు. ముఖ్యంగా వర్షాలు పడుతున్న నేపథ్యంలో గ్రామాల్లో మురికి నీరు నిలబడే అవకాశాలు ఉన్నచోట బ్లీచింగ్ పౌడర్ చల్లాలన్నారు. ఎవరైనా జ్వరాల బారిన పడి ఉంటే వెంటనే ఆసుపత్రులకు వెళ్లేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఇఒఆర్‌డి ఆనందప్రసాద్, డాక్టర్ శ్రీవాణి, పంచాయతీ కార్యదర్శులు, హెల్త్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బాలుర వసతి గృహం తనిఖీ

శింగనమల : మండల పరిధిలోని తరిమెల బాలుర వసతి గృహాన్ని ఎంపిడిఒ బివి.రమణ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇందులో భాగంగా వసతిగృహంలో వసతులపై వార్డెన్ బసవరాజును అడిగి తెలుసుకున్నారు. వసతిగృహంలో సమస్యలపై తర్వలో కలెక్టర్‌కు నివేదిక పంపుతామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి గోవిందరాజులు, తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్‌ను తనిఖీ చేస్తున్న ఎంపిడిఒ బివి.రమణ

పాఠశాల అభివృద్ధికి నగదు వితరణ

బెలుగుప్ప : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరండాలో గ్రిల్స్ ఏర్పాటు చేయడానికి గురువారం గ్రీన్ కో కంపెనీ వారు రూ.2లక్షలు వితరణ చేశారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయులు వెంకటప్రసాద్ మాట్లాడుతూ పాఠశాల అభివృద్ధికి సహకరించాలని గ్రీన్ కో కంపెనీని సంప్రదించిన వెంటనే స్పందించి వితరణ చేయడం సంతోషకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

దుస్తులు, దుప్పట్లు పంపిణీ

దుప్పట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

వజ్రకరూరు : మల్లెల వరలక్ష్మి ట్రస్టు ఆధ్వర్యంలో ఉరవకొండలో ఉన్న విఠల్ రుక్మిణీ వృద్ధ ఆశ్రమంలోని వృద్ధులు, రాజమ్మ చిన్న పిల్లల అనాథాశ్రమంలోని చిన్నారులకు గురువారం దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ట్రస్టు గౌరవాధ్యక్షులు ఎస్.రంగస్వామి మాట్లాడుతూ సొంత సంపాదనతో కొంతమేరకు తోటివారికి సహాయం చేసేందుకు సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలిపారు. పేదలకు సేవ చేయడం ఎంతో సంతృప్తినిస్తోందన్నారు. ఈ కార్యక్రమంలో మల్లెల వరలక్ష్మి, ట్రస్టు అధ్యక్షులు మల్లెల ఫణీంద్ర, కార్యదర్శి సింగాడి దుర్గప్రసాద్, ఆశ్రమం నిర్వాహకులు పాల్గొన్నారు.

భూ కొనుగోళ్ల అక్రమాలపై విచారణకు ఆదేశం

రాయదుర్గం రూరల్ : రాయదుర్గంలోని బిటిపి లేఔట్‌లో ప్రభుత్వ గృహాల నిర్మాణం కోసం కొనుగోలు చేసిన భూముల వ్యవహారంలో వాస్తవాలు విచారించి నివేదిక పంపాలని కలెక్టర్ వినోద్‌కుమార్ గురువారం ఆదేశాలు జారీ చేసినట్లు తహశీల్దార్ చిట్టిబాబు తెలిపారు.

మహారాజ శ్రీ ప్రిన్సిపల్ సివిల్ జడ్జి కోర్టు
(జూనియర్ డివిజన్), నంద్యాల
ఓ.యస్. నెం. 470/2022
పసుపులేటి పృధ్వీరాజ్ .... వాది
వర్సెస్
షేక్ అస్లాం భాష .... ప్రతివాది
ప్రతివాది చిరునామా :
షేక్ అస్లాం భాష , తండి - ఎస్.గులాం హుస్సేన్ బిజినెస్, H.No. 8/124,రంగం టీ స్టాల్, ఎన్టీఆర్ సర్కిల్ opp. శశి మెడికల్ షాప్, గుంతకల్ టౌన్ అండ్ మండలం అనంతపురం జిల్లా.
ప్రతివాదికి దావా సమన్లు
పైన కనపరిచిన వాది పేర ప్రతివాది. ప్రాయించి యిచ్చిన ప్రామిసరి నోటు మొత్తము వడ్డీతో కలిపి రాగోరి ప్రతివాది పైన దావా దాఖలు చేసియుంటున్నాడు.సదరు దావాలో ప్రతివాది అయిన నీకు సమన్లు జారీ చేసినను తీసుకొనక కాలయాపన చేసినందు వల్లను, అందు నిమిత్తం ప్రతివాదియైన నీ పైన పేపరు పబ్లికేషన్ ద్వారా దావా సమన్లు జారీ చేయుటకు ఇచ్చిన కోర్టు ఉత్తర్వు మేరకు ప్రతివాదియైన నీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్నయెడల పై కోర్టు వారి ఎదుట ఖుద్దున గాని, వకీలు ద్వారా గాని 24-7-2024 వ తేదీ ఉదయం 10-30 గం. లకు హాజరై నీ ఆక్షేపణలను తెలుపుకొనవలసినది. లేనంతట పై కోర్టు వారు నీ పరోక్షమందు దావాను పరిష్కరించుదురని యిందు మూలముగా తెలియజేయడమైనది.
(కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)
వాయిదా తేది : 24-7-2024
ఇట్లు
పి. రమేష్ బాబు
వాదిపరం అడ్వకేట్,
నంద్యాల

ఘనంగా రెవెన్యూ దినోత్సవం

ప్రజాశక్తి-శింగనమల

రెవెన్యూ శాఖ నిరంతరం రైతులు, ప్రజల సేవలో పని చేస్తుందని తహశీల్దార్ శోభన్‌బాబు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూశాఖ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం అందించే అనేక సంక్షేమ పథకాలకు అన్ని రకాల ధ్రువీకరణ పత్రాలను రెవెన్యూ శాఖే ఇవ్వాల్సి ఉంటుందన్నారు. దీనికితోడు ఇతర శాఖలతో కలిసి ఎక్కువగా పని చేస్తామన్నారు. ముఖ్యంగా ఎన్నికల నిర్వహణ, భూములు, ఇంటి పట్టాల పంపిణీ వంటి కీలక పనులు రెవెన్యూ శాఖ నిర్వహిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ ప్రకాష్‌రావు, ఇడిటి రామకృష్ణ, మండల సర్వేయర్ గోవిందరాజులు, ఆర్ఐ హనుమాన్, సీనియర్ అసిస్టెంట్ వెంకటరామిరెడ్డి, రైతుసంఘం జిల్లా నాయకులు చెన్నప్పయాదవ్, విఆర్ఒలు, సర్వేయర్లు, ప్రజలు పాల్గొన్నారు.

పామిడి : స్థానిక మండల రెవెన్యూ కార్యాలయంలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ చంద్రశేఖర్‌నాయక్ మాట్లాడుతూ 1786లో రెవెన్యూ శాఖ ఏర్పడిన జూన్ 20వ తేదీని రెవెన్యూ డేగా నిర్వహించుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా రెవెన్యూ సేవల గురించి వివరించారు. తర్వాత రెవెన్యూ శాఖలో ఉన్నత సేవలందించి ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులను ఘనంగా సన్మానించారు. అనంతరం ప్రజలు దరఖాస్తు చేసుకున్న వివిధ రకాల సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ లక్ష్మీనారాయణరెడ్డి, విఆర్ఒలు శ్రీకాంత్‌రెడ్డి, జయచంద్రారెడ్డి, రామాంజనేయులు, శివరామ, నిరంజన్‌రావు, మనోజ్‌కుమార్, వెంకటరాముడు, భాగ్యమ్మ, పరంజ్యోతి, సునీతాబాయి, శాంతకుమారి, రాజేశ్వరి, మల్లేశ్వరి, రమేష్‌నాయక్, రమేష్, సీనియర్ అసిస్టెంట్ నిజాం, జూనియర్ అసిస్టెంట్ తులసి, మండల సర్వేయర్ మురళీధర్, రెవెన్యూ సిబ్బంది, మండల ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

పుట్లూరు : మండల కేంద్రంలోని తహశీల్దార్ కార్యాలయంలో తహశీల్దార్ మల్లికార్జునస్వామి ఆధ్వర్యంలో గురువారం రెవెన్యూ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా కార్యాలయం ముందు మొక్క నాటారు. తర్వాత పలువురు దరఖాస్తు చేసుకున్న వివిధ రకాల పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ దస్తగిరి, విఆర్ఒ అంకన్న ఎంఆర్ఐ కిష్టప్ప, మండల సర్వేయర్ శాంతి, ఏఎస్ఒ విజయ్, విఆర్ఒ ఓబులేసు, రెవెన్యూ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మనహాల్ : మండల కేంద్రంలోని రెవెన్యూ కార్యాలయంలో రెవెన్యూ శాఖ దినోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తహశీల్దార్ రామాంజనేయ రెవెన్యూ శాఖ సేవలపై వివరించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ సుజాత, సర్వేయర్ రవితేజ, ఆర్ఐ బాలకృష్ణ, వీఆర్వోలు తిమ్మప్ప, వన్నూరప్ప, యుగంధర్, సుజాత, రామన్న, కుళ్లాయిస్వామి, రవి, నరసింహమూర్తి, హరి, వీఆర్ఏల సంఘం అధ్యక్షులు మారుతి, రైతులు, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

బెలుగుప్ప : ప్రజలకు అందుబాటులో ఉండి పారదర్శకంగా రెవెన్యూ సేవలు అందిస్తున్నామని తహశీల్దార్ హరినాథరావు తెలిపారు. గురువారం మండల కేంద్రంలోని వాసవీ కళ్యాణ మండపంలో రెవెన్యూ శాఖ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఇందులో భాగంగా విశ్రాంతి విఆర్ఒ వై.శంకర్‌రెడ్డిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఆర్ఐ నగేష్‌బాబు, విశ్రాంతి, విఆర్ఒలు హనుమంతురావు, రాజశేఖర్, ఎర్రిస్వామి, గోవిందప్ప, చంద్రశేఖర్, ఎర్రిస్వామి, నగేష్, వెన్నెల, తదితరులు పాల్గొన్నారు.

గుత్తి : రెవెన్యూ డేను పురస్కరించుకుని గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో గురువారం విశ్రాంత రెవెన్యూ అధికారులు, సిబ్బందిని ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ బి.భారతి, ఉప తహశీల్దార్ లలిత, ఆర్ఐ సందీప్, వీఆర్వోలు, వీఆర్ఏలు, తదితరులు పాల్గొన్నారు.

రాయదుర్గం రూరల్ : రెవెన్యూ సేవలను విస్తృతంగా తెలియజేసేందుకే రెవెన్యూ దినోత్సవాన్ని జరుపుకుంటున్నామని రాయదుర్గం తహశీల్దార్ చిట్టిబాబు తెలిపారు. గురువారం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహశీల్దార్ రఘు, వీఆర్వోలు, వీఆర్ఏలు పాల్గొన్నారు.

రెవెన్యూ డే సందర్భంగా అనంతపురం రెవెన్యూ భవన్‌లో కేక్ కట్ చేస్తున్న కలెక్టర్ డా॥వి.వినోద్‌కుమార్, జెసి కేతన్‌గార్గ్ తదితరులు

పామిడిలో మాట్లాడుతున్న రెవెన్యూ ఉద్యోగులు



గుత్తిలో విశ్రాంత ఉద్యోగులను సన్మానిస్తున్న దృశ్యం